క్లుప్తంగా

రాయితీపై స్ప్రింక్లర్లు

కోవెలకుంట్ల: సూక్ష్మ సాగునీటి పథకం ద్వారా రైతులకు సబ్సిడీపై పైపులు, స్ప్రింక్లర్లు సరఫరా చేస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ ఏరియా అధికారిణి సుధామణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఐదు ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులకు 55 శాతం సబ్సిడీతో వీటిని అందజేస్తామన్నారు. రెండున్నర ఎకరాల్లోపు పొలం కలిగిన రైతులకు మూడు ఇంచీల పైపులు 30, ఐదు స్ప్రింక్లర్ల పూర్తి ధర రూ. 28,732 కాగా సబ్సిడీతో రూ. 17,158కి సరఫరా చేస్తామన్నారు. రెండున్నర ఎకరాలకు మించి ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులకు 41 పైపులు, 9 స్ప్రింక్లర్లు రూ. 40,400 కాగా రూ. 23,763 ప్రకారం అందజేస్తామని తెలిపారు. ఐదు ఎకరాలకు మించి పొలం ఉన్న రైతులు 30 పైపులకు రూ.19,576, 41 పైపులకు రూ. 27,229 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పైపులు, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు ఆయా గ్రామాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

9న మండల మీట్

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జ్ ఎంపీడీఓ ప్రసాదరెడ్డి సోమవారం తెలిపారు. పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకం తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశంలో పాల్గొనాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, ప్రిన్సిపాల్ రాజిక సత్య ప్రపూర్ణ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్ విద్య చాలా కీలకమని.. ప్రణాళిక, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు పక్కీరారెడ్డి, అధ్యాపకులు వీరన్న, కిశోర్, నాగేశ్వరరెడ్డి, సాలిహాబేగం, మురళీమోహన్, రామయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

ప్యాపిలి: మండల తహసీల్దార్‌గా భారతి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురం జిల్లా గుత్తి నుంచి ఆమె బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ప్రతాప్ రెడ్డి అనంతపురం జిల్లా యాడికి మండలానికి బదిలీపై వెళ్లారు. భారతికి రెవెన్యూ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్యాపిలి మండలం గురించి తెలుసుకున్నారు.



భారతి

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవుకు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు.కంప్యూటర్, వెల్డర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, డ్రాఫ్టమెన్ సివిల్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ కోర్సులు అందుబాటు లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 26వ తేదీ సాయంత్రంలోగా iti.a p.go-v.i n వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల ని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

నాటుసారా స్వాధీనం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో సోమవారం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సెబ్ సీఐ జోగేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన తోక నాగరాజు ఇంటి వద్ద సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామని తెలిపారు. దాడుల్లో ఎస్ఐ పోతులయ్య, సిబ్బంది వెంకట రమణ, ప్రసన్న, పాములేటి, శివన్న పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామానికి చెందిన రవిపై ఇదే గ్రామానికి చెందిన దూదేకుల సుభాన్‌తో పాటు మరో ఆరుగురు దాడి చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ సోమవారం తెలిపారు. రవి, సుభాన్ పలుకూరు గ్రామంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తారు. అయితే పాతకక్షలను మనసులో పెట్టుకుని రవిపై దాడికి పాల్పడినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

సమస్యల పాఠాలు

ప్రభుత్వ బడి.. నిన్నటి వరకు డిజిటల్ బోధన, రుచికరమైన భోజనం, మెరుగైన వసతులతో కళకళలాడింది. నేడు అరకొర విద్యా కానుకలు.. రుచిశుచి లేని భోజనాలు.. ఏకోపాధ్యాయుల బోధనలు వంటి సమస్యలతో కళ తప్పింది. అమ్మఒడి ఇవ్వకుండా కష్టాల సుడిగుండంలో పడేసిన టీడీపీ సర్కారు కనీస సౌకర్యాలు తీర్చలేని స్థితిలో ఉండిపోయింది. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో ప్రభుత్వం చదువులను చక్కబెట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై 'సాక్షి' విజిట్ చేయగా పలు సమస్యలు వెలుగు చూశాయి.

డోన్/బనగానపల్లె:

డోన్, బనగానపల్లె నియోజకవర్గంలోని చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అవసరమైన ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల రెండు తరగతుల విద్యార్థులకు ఒక్కరే బోధించాల్సి వస్తోంది. ముఖ్యంగా సైన్స్, మాథ్స్ వంటి కీలక సబ్జెక్టులు బోధించే టీచర్ల కొరత ఉండడంతో విద్యార్థులు వెనుకబడుతున్నారు. మరికొన్ని చోట్ల అరకొరగా తరగతులు ముగించేస్తున్నారు. బనగానపల్లెలో మొత్తం 264 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 27,954 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 1287 మంది ఉపాధ్యాయులు ఉండగా 146 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి సంబంధించి ఏప్రిల్, జూన్, జూలై నెలల్లో నిర్వాహకులకు బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దాని ప్రభావం మధ్యాహ్న భోజనం నాణ్యతపై పడుతోంది. ఇటు డోన్ నియోజకవర్గంలోని మొత్తం 197 ప్రభుత్వ పాఠశాలల్లో 664 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, డోన్‌లో 59, ప్యాపిలిలో 29, బేతంచెర్లలో 54 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి భర్తీకి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వల్ల విద్యార్థులే పాఠాలు చెప్పడం కనిపించింది.

పేరు మారింది.. మెనూ మారలేదు

పాఠశాలల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతిష్టాత్మకంగా జగనన్న గోరుముద్ద పథకం పేరుతో పౌష్టికాహార భోజనం వడ్డించారు. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పేరును పీఎం పోషణ పథకంగా పేరు మార్చారు. వారానికి ప్రతి విద్యార్థికి నాలుగుసార్లు కోడిగుడ్లు, రెండు సార్లు చిక్కీలు ఇవ్వాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల నుంచి వీటిని పంపిణీ చేయడం లేదు. దీంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యం నీరుగారుతోంది. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్య వంటి పథకాలకు పేరు మార్చినా పైసా ఖర్చు చేయకపోవడం పేద విద్యార్థుల పాలిట శాపంగా మారింది.

ఉపాధ్యాయుల కొరత ఉంది



పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్న మాట వాస్తవం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతోనే పూర్తి స్థాయిలో విద్యాబోధన అందేలా చూస్తున్నాం. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో రెండు తరగతులను ఒకచోట చేర్చి బోధన చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–స్వరూప, ఎంఈఓ, బనగానపల్లె



ప్యాపిలి మండలం కలచట్లలో ఉపాధ్యాయుడు ఒకవైపు, విద్యార్థి మరోవైపు పాఠాలు చెబుతున్న దృశ్యం



నాడు.. జగనన్న గోరుముద్ద మెనూ



నేడు.. కూటమి ప్రభుత్వంలో పీఎం పోషణ

డోన్ నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	ఉపాధ్యాయ ఖాళీలు
డోన్	79	11349	59
బేతంచెర్ల	54	7497	54
ప్యాపిలి	64	6676	29
మొత్తం	197	25522	142

బనగానపల్లె నియోజకవర్గంలో..

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	టీచర్లు	ఖాళీలు
బనగానపల్లె	79	9945	475	54
కోవెలకుంట్ల	36	4159	168	04
సంజామల	41	3592	168	18
అవుకు	49	4935	254	27
కొలిమిగుండ్ల	59	5323	222	43
మొత్తం	264	27954	1287	146

రైల్వే అండర్ బ్రిడ్జి పనుల అడ్డగింత

డోన్ రూరల్: మండల పరిధిలోని సొంపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న అండర్ పాస్ బ్రిడ్జి పనులను సోమవారం ఉడుములపాడు గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూసేకరణ చేయకుండానే రైల్వే అధికారులు అండర్ పాస్ బ్రిడ్జి పనులు చేస్తున్నారని అన్నారు. అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే రైతులు పొలాలకు వెళ్లిరావడానికి ఇబ్బందిగా ఉంటుందన్నారు. చుట్టుపక్కల ఉన్న రైతులకు దారి చూపించిన తర్వాతే బ్రిడ్జి నిర్మాణ పనులు చేయాలని కోరారు.



బ్రిడ్జి పనులను అడ్డుకుంటున్న రైతు

సీఐని సస్పెండ్ చేయాలని నిరసన



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

డోన్ టౌన్: ఆళ్లగడ్డకు చెందిన న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై దాడికి పాల్పడిన నంద్యాల సీఐ రాజారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డోన్ బార్ కౌన్సిల్ సభ్యులు డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ సివిల్ కేసుకు సంబంధించి న్యాయవాది సుబ్బరామిరెడ్డిపై సీఐ దాడి చేశారని ఆరోపించారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు బద్దల వెంకటేష్, న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, పులి దామోదర్, ధనుంజయరెడ్డి, జొన్నలగడ్డ శ్రీను, శ్రీధర్, మల్లికార్జునరెడ్డి, మద్దయ్య, శేషశయనరావు, రవికుమార్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి



వృద్ధురాలుకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

బనగానపల్లె రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని ఎంపీహెచ్ఈఓ సుబ్బరాయుడు అన్నారు. సోమవారం బనగానపల్లె సచివాలయం-3 పరిధిలో అర్హులైన వృద్ధులకు వ్యాక్సిన్ వేశారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, దీర్ఘకాలిక క్షయవ్యాధిగ్రస్తులు, వారి కాంటాక్ట్ వ్యక్తులు బీసీజీ టీకాను వేయించుకోవాలని పేర్కొన్నారు. టీకాతో క్షయ వ్యాధి నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు.

రైతు బజార్ ఏర్పాటు




దుకాణాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ సత్యదీప్

డోన్ టౌన్: సేంద్రియ పద్ధతులతో పండించిన కూరగాయలను ప్రజలకు అందించేందుకు ప్రతి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సత్యదీప్ తెలిపారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గోసానిపల్లె గ్రామానికి చేసిన రైతులు ఏర్పాటు చేసిన రైతు బజార్ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సంజామల: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు పేరుసోముల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 4వ తేదీ నంద్యాలలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో చంద్రిక, దివ్య, శ్రీకల్పన, దస్తగిరమ్మ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 11వ తేదీ తూర్పు గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను హెచ్ఎం సీతరావమ్మ, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలకు చెందిన సాన్విత రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గీతా తెలిపారు. రెండు రోజుల క్రితం నంద్యాలలోని గుడ్‌షెఫర్డ్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని సాన్విత సత్తా చాటిందన్నారు. త్వరలో వైజాగ్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని తెలిపారు. విద్యార్థినిని హెచ్ఎంతో పాటు కరస్పాండెంట్ జాన్ మేరీ, ఫిజికల్ డైరెక్టర్లు హర్ష, ఓబులేసు, అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వేడుకగా ఉమామహేశ్వరుని పల్లకీసేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి పల్లకీ సేవ ఘనంగా జరిగింది. ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామికి ఉదయం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పల్లకీ సేవ చేశారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న ఆలయ సిబ్బంది

8న ఎస్ఎంసీ ఎన్నికలు

ప్యాపిలి: ఈనెల 8వ తేదీ జరిగే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు మండల స్థాయి అధికారులు సహకరించాలని ఎంఈఓ వెంకటేశ్ నాయక్ కోరారు. సోమవారం తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ సాయి మనోహర్‌ను కలిసి పాఠశాల యాజమాన్య కమిటీల గురించి వివరించారు. ప్రతి పాఠశాల నుంచి 15 మంది సభ్యులలో ఒకరికి చైర్మన్, మరొకరికి వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహిస్తామన్నారు. రెండేళ్ల కాల వ్యవధి ఉంటుందన్నారు.



ఎన్నికల వివరాలను ఎంపీడీఓకు అందజేస్తున్న ఎంఈఓ

దాడి కేసులో నిందితుల అరెస్టు

ప్యాపిలి: మండల కేంద్రంలో ఈ నెల 4వ తేదీ దాడికి పాల్పడిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీఐ సుధాకర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపర్చి వివరాలు వెల్లడించారు. ప్యాపిలికి చెందిన బలరాముడు, రంగమ్మ, పులిశేఖర్‌ను కమలాకర్, శేఖర్, కళ్యాణ్, దివాకర్, సునీత, రాణి దాడి చేసి గాయపర్చినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ

బేతంచెర్ల: పట్టణంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఆ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చరణ్ నాయక్, నరసింహ, సహాయ కార్యదర్శులుగా రవీంద్ర నాయక్, తిరుమలేష్, ఉపాధ్యక్షులుగా నాగరాజు, సాయితో పాటు కమిటీ సభ్యులను ప్రకటించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పరిసరాల శుభ్రత పాటించాలి


బేతంచెర్ల: పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు అన్నారు. సోమవారం బేతంచెర్ల పట్టణంలోని ప్రధాన రహదారి వెంట ఉన్న డ్రైనేజీ కాలువలను నగర పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్తాచెదారం, ప్లాస్టిక్ బాటిళ్లు, గ్లాసులు వేయవద్దని సూచించారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు

డోన్ టౌన్: పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించొద్దని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వంద రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలో పారిశుద్ధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారులైన కోర్టు రోడ్డు, బేతంచెర్ల రోడ్డు, కర్నూలు రోడ్డులో జరుగుతున్న కాలువ పూడికతీత పనులు, పారిశుద్ధ్య పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషా, సిబ్బంది ఉన్నారు.

సీఐగా బాధ్యతలు


బనగానపల్లె: బనగానపల్లె రూరల్ సీఐగా మంజునాథ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో నంద్యాల సీసీఎస్‌లో పనిచేశారు. ఇక్కడ సీఐగా ఉన్న గంటా సుబ్బారావు నంద్యాల వీఆర్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూరల్ పరిధిలో ఉండే నందివర్గం, అవుకు పోలీస్‌స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతలు కాపాడతామని తెలిపారు. ఆయన్ను నందివర్గం ఎస్ఐ తిరుపాల్, అవుకు ఎస్ఐ కిరణ్‌బాబుతో పాటు పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.



మంజునాథ్‌రెడ్డి

బేతంచెర్ల సీఐగా వెంకటేశ్వరరావు

బేతంచెర్ల: బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో సీఐగా డి. వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రియతంరెడ్డి నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల ఎస్పీ నుంచి వెంకటేశ్వరరావు ఇక్కడికి వచ్చారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.



22న విగ్రహ ప్రతిష్టాపన

డోన్ రూరల్: మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో ఈనె22 నుంచి 24వ తేదీ వరకు జెర్రికొండ లక్ష్మీనరసింహస్వామి ఆరాధన ఉత్సవాలు, పంచముఖ ఆంజనేయస్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు జరుగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 24న ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని.. గెలుపొందిన ఎద్దులకు 40,30,20,15,10,5,3 వేల రూపాయలను బహుమతిగా ప్రకటించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ లైన్ల మార్పు కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. మహాలక్ష్మీ ఆస్పత్రి, కృష్ణానగర్, పండరి నగర్, అయ్యప్పస్వామి గుడి, కురుకుందకాలనీ, గాంధీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని.. ప్రజలు సహకరించాలని కోరారు.

ప్యాపిలి: జలదుర్గం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వినయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామరత్నగిరి, గోపాలనగరం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

బనగానపల్లె రూరల్: మండలంలోని పలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని రూరల్ ఏఈ గర్జప్ప తెలిపారు. కాగా రైతులకు సరఫరా చేసే ఉచిత విద్యుత్ ఉదయం 3 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మదానుపల్లె సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 4 నుంచి 8, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పరంధామ నిలయంలో పట్టణానికి చెందిన 150 మందికి రూ. 100 చొప్పున పింఛన్లను పంపిణీ చేశారు. రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, వాల్మీకి సంఘం నాయకుడు సుబ్బయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

ఒకే సిలబస్ అమలు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ నేత సత్యప్రకాష్

బనగానపల్లె రూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకే సిలబస్ అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో స్టేట్, సెంట్రల్ పేరుతో రెండు రకాల సిలబస్‌లు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది నుంచి ఐబీ సిలబస్ ప్రారంభిస్తున్నట్లు అధికారులు ప్రకటించారన్నారు. ఇలా రకరకాల సిలబస్‌ల వల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. ఒకే సిలబస్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. యూటీఎఫ్ నేతలు ప్రతాప్, వెంకటేశ్వర్లు, దస్తగిరి, సుధాకర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వర స్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, బెలుం సిద్ధరామేశ్వరస్వామి, పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వరస్వామి తదితర ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆయా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.